8న జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం మార్చి 8న జిల్లాలోని అన్ని కోర్టులలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు ప్రమాద కేసులు, వివాహ సంబంధ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు పరిష్కరించుకోవచ్చని, ఇందుకోసం మొత్తం 15 బెంచీలను ఏర్పాటు చేస్తున్నట్టు, ఇప్పటివరకు పోలీస్, ఇన్సూరెన్స్ కంపెనీలతో చర్చించి లోక్ అదాలత్ పట్ల వారికి అవగాహన కల్పించి రాజీపడదగిన అనేక కేసులు గుర్తించడం జరిగిందని, రాజీమార్గమే రాజమార్గంగా కేసులు సత్వర పరిష్కారం కోసం కక్షిదారులు డబ్బు, విలువైన సమయాన్ని ఆదా చేసుకోవటానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. కక్షిదారులు కేసుల రాజీపట్ల ఎలాంటి సందేహాలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మంను సంప్రదించవలసిందిగా ఆయన కోరారు.



ఖమ్మంలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఉపాధ్యాయులు



బ్యాలెట్ బాక్సులను కొత్తగూడెం నుంచి నల్లగొండ స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్న దృశ్యం



ఖమ్మంలో ఓటు వేసిన ఉపాధ్యాయురాలు

టీచర్ల తీర్పు నిక్షిప్తం

- ఖమ్మం జిల్లాలో 93.05 శాతం
- మొత్తం ఓటర్లు 4,089.. పోలైన ఓట్లు 3,805
- బోనకల్‌లో నూరుశాతం పోలింగ్
- భద్రాద్రి జిల్లాలో 91.94శాతం
- మొత్తం ఓటర్లు 2,022.. పోలైన ఓట్లు 1,859
- ఖమ్మం రిక్కాబజార్ సెంటర్ వద్ద స్వల్ప ఘర్షణ

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం జిల్లాలో మొత్తం 4,089 ఓట్లు ఉండగా.. 3,804 ఓట్లు పోలయ్యాయి. 93.05శాతం పోలింగ్ నమోదైంది. పోలైన ఓట్లలో పురుషులు 2,214, మహిళలు 1,590 ఓట్లు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 21 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఖమ్మం నగరంలో అత్యధికంగా ఉపాధ్యాయుల ఓట్లు ఉండడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు (మిగతా 6వ పేజీలో)

మోదీ ఫ్లెక్సీపై వివాదం

బీజేపీ, టీఎస్‌యూటీఎఫ్ నేతల మధ్య స్వల్ప ఘర్షణ, ఉద్రిక్తత

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల పోలింగ్ కేంద్రం సమీపంలో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. తమ అభ్యర్థులకు ఓటువేయాలని టెంట్లు వేసుకుని పోటాపోటీగా ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో బీజేపీ మద్దతుతో బరిలో ఉన్న పులి సరోత్తంరెడ్డికి ఓటువేయాలంటూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు బ్యాలెట్ నమూనాను చూపిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. వీరికి సమీపంలోనే టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలు బ్యాలెట్ నమూనాతో ప్రచారం సాగిస్తున్నారు. ఈ క్రమంలో యూటీఎఫ్ (మిగతా 6వ పేజీలో)



బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



అశ్వారావుపేటలో చిన్నారితో ఓటు వేసేందుకు వచ్చిన ఉపాధ్యాయురాలు

విజయం మాదే!

- ఎమ్మెల్సీ పోలింగ్ సరళిపై అభ్యర్థుల విశ్లేషణలు
- గెలుపుపై ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ధీమా
- నల్లగొండ స్ట్రాంగ్ రూంకు తరలిన బ్యాలెట్ బాక్సులు

ఖమ్మం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఘట్టం ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు, వారికి సంఘాలు, రాజకీయపార్టీలు మద్దతు ఇవ్వడంతో గెలుపుపై ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. జిల్లాల వారీగా పోలింగ్ సరళిపై సమాచారం తీసుకొని విశ్లేషణలు చేస్తున్నారు. ఈ ఎన్నికల బరిలో మొత్తం 19మంది అభ్యర్థులు నిలిచినా.. ప్రధాన పోటీ టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పూలరవీందర్, హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ మద్దతుతో పులి సరోత్తంరెడ్డి మధ్యనే ప్రధాన పోటీ జరిగినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యూటీఎఫ్, పీఆర్టీయూ మధ్యనే ప్రధాన పోటీ జరిగినట్టు పోలింగ్ సరళి స్పష్టం చేస్తోంది. పోలింగ్ ముగిసిన అనంతరం యూటీఎఫ్ తన అభ్యర్థి నర్సిరెడ్డికే విజయ అవకాశాలు ఉంటాయని, ఆయనకే సానుకూలంగా మెజారిటీ ఓట్లు పోలయ్యాయని అంచనా వేస్తోంది. పీఆర్టీయూ కూడా తమ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికే ఎక్కువ ఓట్లు పోలయ్యాయని విశ్లేషిస్తోంది. మూడు జిల్లాల్లో పీఆర్టీయూ ఓటుబ్యాంకు బలంగా ఉన్నందున తమదే విజయం అన్న ధీమాతో ఆ యూనియన్ ఉంది. ఇక బీజేపీ నుంచి నిలిచిన పులి సరోత్తంరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు పూల రవీందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి వర్గీయులు కూడా ఫలితం తమకే అనుకూలంగా ఉంటుందన్న ఆశతో ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో బ్యాలెట్ బాక్సులు నల్లగొండలోని స్ట్రాంగ్‌రూంకు వెళ్లాయి. మార్చి 1న కౌంటింగ్ జరగనుంది. అప్పటి వరకు అభ్యర్థుల్లో ఉత్కంఠ కొనసాగనుంది.

అర్ధరాత్రి 64 రిజిస్ట్రేషన్ల ఘటనపై

9మందిపై కేసు నమోదు

వైరా/కొణిజర్ల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబరు 28వ తేదీ అర్ధరాత్రి వరకు వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన ఇండోఖతార్‌లోని కోట్లాది రూపాయలకు చెందిన స్థలాలకు సంబంధించి చేసిన 64 రిజిస్ట్రేషన్ల వ్యవహారం మలుపు తిరిగింది. ఈ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన తొమ్మిదిమందిపై ఈనెల 25న కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు (ఎఫ్ఆర్ఐ నెంబర్ 50/2025)ను కొణిజర్ల ఎస్ఐ జి.సూరత్ నమోదు చేసిన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఇండోఖతార్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పొలిశెట్టి గిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మక్కెన రాము, ముళ్ల కిషోర్, కర్నాటి శరత్, బొబ్బల రాంబాబు, పుసులూరి అరవింద్, మేకల అజయ్, వాసీం, పందిళ్లపల్లి రాజు, బోనగిరి ఉపేందర్‌పై ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గతేడాది డిసెంబరు 28వ తేదీ అర్ధరాత్రి వరకు వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 64 నకిలీ రిజిస్ట్రేషన్లు నిర్వహించారని రూ.200కోట్ల విలువైన స్థిరాస్తులకు నకిలీ డాక్యుమెంట్లు రూపొందించి అక్రమంగా బదిలీ చేశారని, వీటిలో 480 ప్లాట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ ద్వారా మార్పిడి చేశారని, రూ.42 లక్షలు అక్రమంగా బదిలీ అయ్యాయని, బ్యాంకు మార్టిగేజ్‌లో ఉన్న ఆస్తులను అసలు భూ యజమానులకు తెలియకుండా తప్పుడు పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేశారని, పోలీసులకు ఇచ్చిన (మిగతా 6వ పేజీలో)

ప్రభుత్వ లాంఛనాలపైనా

నిర్లక్ష్యమేనా?

- తానీషా సంప్రదాయానికి మంగళం
- మూడు దశాబ్దాలుగా లాంఛనాలు జీవోలకే పరిమితం
- నాడు ఉమ్మడిలో... నేడు స్వరాష్ట్రంలో రామయ్యకు రిక్తహస్తం



భద్రాచలం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచల పుణ్యక్షేత్రంలో శ్రీరామనవమి నాడు రామయ్యకు తానీషా సంప్రదాయంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించే లాంఛనాలు జీవోలకు పరిమితమవుతున్నాయని రామ భక్తులు వాపోతున్నారు. ఇలా ఒక ఏడాది, ఐదేళ్ల, పదేళ్ల కాదు. ఏకంగా మూడు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాలు, నేడు స్వరాష్ట్రం సాధించిన 11ఏళ్ల కావస్తుండగా నేటికి ప్రభుత్వాలు జీవోలను జారీ చేస్తూ లాంఛనాలు మాత్రం విడుదల చేయకపోవడం పట్ల రామ భక్తుల నుంచి ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

తానీషా సంప్రదాయానికి మంగళం

భక్తరామదాసు 17వ శతాబ్దంలో రామాలయం నిర్మాణం పూర్తి చేయగా అనంతరం రామదాసును ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారని అప్పటి గోల్కొండ నవాబు తానీషా బందీఖానాలో వేయడం, రామలక్ష్మణులు శ్రీరామమాడలను సమర్పించడంతో జ్ఞానోదయం అయి భక్తరామదాసును విడిపించడం జరిగింది. ఈ క్రమంలో తానీషా స్వామివారి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టడమే కాకుండా ప్రతీ ఏటా తమ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తుందని పత్వా జారీ చేశారు. నాటినుంచి శతాబ్దాల పాటు కొనసాగిన సంప్రదాయానికి మంగళం పలకడం పట్ల రామభక్తులు ఆవేదన చెందుతున్నారు. కాగా ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలకు ప్రతి ఏటా ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన నాటి నుంచి రూ.15వేలు చెల్లిస్తుండగా నేటికి అదే మొత్తానికి మంజూరు లభిస్తోంది. బాధాకరమైన విషయం ఏమిటంటే ఆ రూ.15 వేలకు సంబంధించిన డబ్బులు దేవస్థానం ఖాతాకు జమ కావడం లేదని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

లాంఛనాల పెంపు ప్రతిపాదన అటకెక్కింది

శ్రీరామనవమి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి సమర్పించే పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు కొనుగోలుకు రూ.15వేలను గతంలో (మిగతా 6వ పేజీలో)



ఏబీసీ సెంటర్‌కు తరలిస్తున్న కుక్కలు

రంజాన్‌కు ముందస్తు

ఏర్పాట్లు షురూ

- ఖమ్మంలో 66 మసీదుల గుర్తింపు
- పారిశుధ్య, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసం సందర్భంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న మసీదుల వద్ద ఏర్పాట్లు షురూ చేశారు. ఖమ్మం నగరంలో మొత్తం 66 మసీదులను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలపై కమిషనర్ అభిషేక్ అగస్త్య వివరాలు సేకరించారు. కుక్కల బెడద అధికంగా ఉందని ముస్లిం మత పెద్దలు ఫిర్యాదు చేయటంతో రెండు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలు డివిజన్లలోని 40కి పైగా కుక్కలను కేఎంసీ సిబ్బంది పట్టుకొని వాటిని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)కు తరలించారు. గుర్తించిన మసీదుల వద్ద ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాలు ప్రారంభించారు. తాగునీరు, విద్యుత్ వ్యవస్థ, ప్రధాన మసీదుల వద్ద పెద్ద వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- రిక్కాబజార్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించినట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు 93.05 శాతం పోలింగ్ నమోదైందని ఆయన తెలిపారు. గురువారం ఆయన ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ శాసన మండలిలో టీచర్స్ స్థానాల ఎన్నికల పోలింగ్ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 24 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 4,089 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, ఉదయం 8 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు 20.35 శాతం, మధ్యాహ్నం 12 గంటల వరకు 54.34 శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 79.53 శాతం, సాయంత్రం 4 గంటలకు 93.05 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3,805 మంది ఓటు వేయగా, అందులో 2,218 మంది పురుష ఓటర్లు, 1,587 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత నల్లగొండలో ఉన్న రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లను తరలించనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోసం అవసరమైన బందోబస్తు, ఏర్పాట్లు పోలీసులు కట్టుదిట్టంగా చేశారని, పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ అన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



చాలా రోజులైంది.. బావున్నారా..?

ఉపాధ్యాయుల ఆత్మీయ పలకరింపులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'చాలా రోజులైంది. మిమ్మల్ని చూసి.. బావున్నారా.. ఎక్కడా ఇప్పుడు...!' అంటూ ఆత్మీయ పలకరింపులు కనిపించాయి. గురువారం ఖమ్మం నగరం రిక్కాబజార్ పాఠశాలలో ఎమ్మెల్సీ ఓటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఓటేయడానికి వచ్చారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో కలిసి పనిచేసిన ఆత్మీయులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అమ్మో ఎన్ని రోజులయ్యింది.. చూసి బావున్నారా... ఎక్కడా చేస్తున్నారు ఇప్పుడు అంటూ పలకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను మరోమారు గుర్తుచేసుకున్నారు. షేక్ హ్యాండ్ తీసుకుంటూ ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ

పోలింగ్‌ను పరిశీలించిన సీపీ

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సీపీ సునీల్‌దత్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో రద్దీ ఎక్కువగా ఉండకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంకు తరలించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఖమ్మంజిల్లాలో ఏడుగురు ఏసీపీలు, 16 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు 470 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొన్నట్లు సీపీ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ నుంచి ప్రేమజంట పరార్?

ఎస్పీ రోహిత్‌రాజ్ విచారణ

పాల్వంచ,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా పాల్వంచటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఓ ప్రేమజంట పరారైంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారించారు. ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పాల్వంచ మండలానికి చెందిన బాలిక (17) పాల్వంచటౌన్ పరిధిలోని ఓ కళాశాలలో చదువుతోంది. ఈ క్రమంలో ఈనెల 23న సదరు బాలిక అదృశ్యమవడంతో ఆమె తల్లిదండ్రులు పాల్వంచటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తుండగా.. గురువారం సదరు బాలిక ఓ యువకుడితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తాము ప్రేమించుకున్నామని, తమకు వివాహం చేయాలని పోలీసు అధికారులను కోరింది. అయితే బాలిక మైనర్ కావడంతో వివాహం చేయడం సాధ్యం కాదని పోలీసులు తేల్చిచెప్పి యువకుడిపై కేసు నమోదు చేయడానికి ఉపక్రమించారు. దీంతో భయపడ్డ బాలిక వాష్‌రూంకు వెళ్లి వస్తానని చెప్పి తన ప్రియుడితో కలిసి పోలీసుల కళ్లుగప్పి స్టేషన్‌నుంచి పరారైంది.దాంతో పోలీసులు ఖంగుతిన్నారు. ఈ ఘటనపై విచారణ చేసిన ఎస్పీ రోహిత్‌రాజ్ టౌన్ పోలీసుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. ఈ కేసును మరో అధికారికి అప్పగించినట్టు సమాచారం. కాగా ఈ విషయంపై పాల్వంచ సీఐ సతీష్‌ను వివరణ కోరగా.. ఈ కేసు మైనర్‌కు సంబంధించినది కావడంతో వివరాలను బహిర్గతం చేయలేమన్నారు.



ఖమ్మంలో ఓటు వేస్తున్న ఉపాధ్యాయురాలు



ఖమ్మంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఉపాధ్యాయులు

ముగిసిన పోలింగ్

ఇరుజిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం



ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో ఓటు వేసేందుకు వస్తున్న టీచర్లు



ఖమ్మం పోలింగ్ కేంద్రంలో...



కొత్తగూడెం సింగరేణి హైస్కూల్‌లో ఓటు వేసిన ఉపాధ్యాయులు



పాల్వంచలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్



ఖమ్మంలో బ్యాలెట్ బాక్సులు సీల్ వేస్తున్న దృశ్యం



కరకగూడెంలో ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న అధికారులు

యువకుడికి జీవిత ఖైదు

పెనుబల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో ఐదేళ్ల క్రితం ఓ యువతిని యువకుడు ప్రేమపేరుతో మోసగించిన హత్య చేసిన ఘటనలో యువకుడికి జీవిత ఖైదుతోపాటు రూ.పదివేల జరిమానా విధిస్తూ సత్తుపల్లి ఆరోవ అదనపు జిల్లా, సెషన్‌కోర్టు జడ్జి ఎం.శ్రీనివాసరావు తీర్పు వెలువరించినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగం గురువారం తెలిపారు. సీఐ తెలిపిన ప్రకారం... 2020సంవత్సరంలో వీఎంబంజర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యువతి హత్యకు సంబంధించి అప్పటి అధికారులు కేసు నమోదు చేయటంతోపాటు విచారణ చేపట్టి కోర్టుకు చార్జ్‌షీట్‌ను సమర్పించారు. వాదోపవాదనలు విన్న న్యాయాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం నిందితుడు బొల్లేడు నితిన్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.పదివేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా పనిచేసిన అప్పటి సీఐలు సురేష్‌కుమార్, రవికుమార్, తాటి పాముల కరుణాకర్, ప్రస్తుత సీఐ ముత్తి లింగంగౌడ్, ఎస్ఐ వెంకటేష్‌ను ఏపీపీ అబ్దుల్ బాషా, కోర్టు కానిస్టేబుల్ గిరిలను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. అనంతరం నిందితుడిని ఎస్ఐ వెంకటేష్ జైలులో అప్పగించారు.

ప్రభుత్వ లాంఛనాలపైనా నిర్లక్ష్యమేనా?

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో చెల్లించేవారు. అయితే ప్రస్తుతం స్వామి వారికి కల్యాణం సమయంలో సమర్పించే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు కొనుగోలుకు భద్రాద్రి దేవస్థానం అధికారులకు రూ.50 వేల వరకు ఖర్చవుతున్నట్లు సమాచారం. అలాగే వీవీఐపీలకు, భక్తులకు పంపిణీ చేసే ముత్యాల తలంబ్రాలను ప్రత్యేకంగా రూ.10 లక్షల మేర కొనుగోలు చేస్తున్నారు. అయితే 2020 మార్చి 3న నవమి ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన అప్పటి రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ అనిల్ కుమార్ ప్రభుత్వం అందజేస్తున్న రూ.15 వేల లాంఛనాలను రూ.లక్షకు పెంచుతామని ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు దేవస్థానం అధికారులు వెంటనే పంపాలని ఆదేశించారు. కమీషనర్ ఆదేశాలతో 24 గంటల్లో ఇందుకు సంబంధించిన ప్రక్రియను దేవస్థానం అధికారులు పూర్తి చేసినా లాంఛనాలకు లక్ష అనే ఊసే మరిచారు.

ఏటా రూ.6 కోట్లు ఇవ్వాలని కోరుతున్న రామ భక్తులు

భద్రాద్రి రామయ్య కల్యాణ బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థానంకు ఏటా రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రామ భక్తులు కోరుతున్నారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల ప్రత్యేక ఉత్సవాలకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిదులు కేటాయిస్తున్న క్రమంలో దక్షిణ అయోధ్యగా విరాజిల్లే భద్రాద్రి రామయ్యకు రూ.6 కోట్లు ప్రతి ఏటా ఇవ్వాలని రామ భక్తులు డిమాండ్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.కోటి శ్రీరామనవమి కోసం మంజూరు చేసి విడుదల చేశామని చెప్పినా అవి తమకు అందలేదని దేవస్థానం వర్గాలు అంతర్గతంగా పేర్కొంటుండటం గమనించదగ్గ విషయం.

బీజాపూర్ జిల్లాలో 18మంది మావోయిస్టుల అరెస్టు

చర్ల, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గుంజిపర్తి, బాసగూడ, భైరంగడ్ అడవుల్లో 18మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు అరెస్టు చేశాయి. గుంజిపర్తి అడవుల్లో గురువారం కోబ్రా బలగాలు కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో అడవుల్లో అనుమానాస్పందంగా 10 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని విచారించగా మావోయిస్టు సభ్యులుగా తేలిందని బలగాలు తెలిపాయి. అలాగే బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో కూబింగ్ చేస్తున్న కోబ్రా బలగాలు ఏడుగురు మావోయిస్టు పార్టీ సభ్యులను అరెస్టు చేశాయి. వారి నుంచి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బీజాపూర్ జిల్లా భైరంగడ్ అడవుల్లో ఒక మావోయిస్టుని పోలీసులు అరెస్టు చేసి విప్లవ సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లాలో గురువారం ఒక్కరోజే మొత్తం 18మంది మావోయిస్టు దళ సభ్యులను అరెస్టు చేయగా వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు.

టీచర్ల తీర్పు నిక్షిప్తం

(5వ పేజీ తరువాయి)

ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల వద్దకు భారీగా తరలి వచ్చారు. దాంతో సాధారణ ఎన్నికల తరహాలో సందడి నెలకొంది. శ్రీపాల్‌రెడ్డి తరుపున టీఎస్‌పీఆర్టీయూ, అలుగుబెల్లి నర్సిరెడ్డి తరుపున టీఎస్‌యూటీఎఫ్, పులి సరోత్తంరెడ్డి తరపున బీజేపీ, గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తరపున టీపీఆర్‌టీయూ, స్వంతంత్ర అభ్యర్థి పూల రవీందర్‌తోపాటు పలువురు అభ్యర్థులు కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటు ఉన్న రిటైర్డ్ ఉపాధ్యాయులు సైతం వచ్చి ఓటువేశారు. ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఉదయం రెండు గంటల్లోనే భారీగా ఓటర్లు వచ్చి ఓటేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఇక్కడ 79.53 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి ఈ పాఠశాలలోని నాలుగు పోలింగ్ బూత్‌లో 1,986మంది ఓటర్లకు గాను 1,826మంది ఓటు వేశారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. బోనకల్ మండలంలో నూటికి నూరుశాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ బూత్‌లో 34మంది ఓటర్లు ఉండగా.. అందరూ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయ ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడంతో ఎన్నికల సందడి నెలకొంది. ఇదిలా ఉండగా ఖమ్మం మయూరి సెంటర్ వద్ద ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రచార టెంట్ల వద్ద ఫ్లెక్సీల వివాదం తలెత్తి బీజేపీ, టీఎస్‌యూటీఎఫ్ నేతల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలను శాంతింపజేశారు.

భద్రాద్రి జిల్లాలో 91.94శాతం పోలింగ్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల్లోపే ముగిసింది. జిల్లాలో మొత్తం 23 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2022 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా.. వారిలో 1,859మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో పురుషులు 973 మంది, మహిళలు 886 మంది ఉన్నారు. ఈ జిల్లాలో 91.94శాతం పోలింగ్ నమోదైంది. లక్ష్మీదేవిపల్లి ప్రాంతంలోని శ్రీరామచంద్ర డిగ్రీ ప్రభుత్వ కాలేజీలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంతోపాటు కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటరులో సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లు పరిశీలించారు. పోలింగ్ నిర్వహణ బాధ్యతలను మొత్తం 110మంది అధికారులు నిర్వహించగా.. 463మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను అధికారుల సమక్షంలో ప్రత్యేక వాహనాల్లో నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూంకు తరలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలతో కూడిన భద్రాద్రి జిల్లాలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మోదీ ఫ్లెక్సీపై వివాదం

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అక్కడ ఓ ఫ్లెక్సీని పెట్టడంతో బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దాంతో యూటీఎఫ్ మద్దతుదారులు తమ ఫ్లెక్సీని తొలిగించారు. అనంతరం యూటీఎఫ్, టీఎస్‌పీఆర్టీయూ సంఘాల నాయకులు బీజేపీ టెంట్‌లో ఉన్న ప్రధాని మోదీ ఫ్లెక్సీని తొలిగించాలని ఆందోళన చేశారు. అయితే మోదీపై టీఎస్‌యూటీఎఫ్ వారు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్తలు టీఎస్‌యూటీఎఫ్ టెంట్లను కిందపడేశారు. దీంతో రెండువర్గాల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలిస్తుండగా.. వారి మద్దతుదారులు అడ్డుగా నిలిచారు. అనంతరం ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పి వదిలేశారు. ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా బ్యాలెట్ నమూనాతో ఖమ్మం మయూరిసెంటర్‌లో రోడ్డుపైనే అన్ని ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థుల తరపున పోటాపోటీగా ప్రచారటెంట్లు వేసి సాధారణ ఎన్నికలను తలదన్నేలా ప్రచారం సాగించారు.

ఇందిరమ్మ ఇళ్లను పటిష్టంగా నిర్మించుకోవాలి: కలెక్టర్



ఏన్కూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ ఇళ్లను పటిష్టంగా నిర్మించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లబ్దిదారులను కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన రేపల్లేవాడ గ్రామంలో గురువారం ఇళ్ల లబ్దిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.

సుదీర్ఘ సమస్యకు పరిష్కారం

గత 40 ఏళ్లనుండి అపరిష్కృతంగా ఉన్న సమస్యకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో పరిష్కారం లభించింది. ఏన్కూరు గురుకుల మరియు కళాశాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా పాఠశాల దారినే వెలుగు, సీఎల్ఆర్‌సీ భవనాల రహదారి కావడంతో విద్యార్థులకు రక్షణ కొరవడిందని చెప్పగా స్పందించిన కలెక్టర్ వెంటనే ఆ భవనాలకు వేరే రహదారి కేటాయించాలని ఆదేశించారు.

అర్ధరాత్రి 64 రిజిస్ట్రేషన్ల ఘటనపై 9మందిపై కేసు నమోదు

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదులో గిరి పేర్కొన్నారు. అంతేకాకుండా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి ఏ7గా ఉన్న వాసీం సీసీ టీవీ హార్డ్‌డిస్క్, ఎన్‌వీఆర్, డీవీఆర్ అపహరించారని, ఏ8గా ఉన్న పందిళ్లపల్లి రాజు, ఏ 9గా బోనగిరి ఉపేందర్‌లు తన కార్యాలయానికి ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి క్రమం తప్పకుండా వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని, అలాగే మక్కెన రాము, ముత్తా కిషోర్‌లు తన కదలికలను గమనిస్తూ తన స్థలాలను తనిఖీ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, సస్పెండ్ అయిన వైరా సబ్‌రిజిస్ట్రార్ రూ.రెండుకోట్ల లంచం తీసుకొని నకిలీ రిజిస్ట్రేషన్లు చేశారని వీరందరిపై కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని గిరి ఈ నెల 25న చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు పైన పేర్కొన్న నిందితులపై కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్ ఆధ్వర్యంలో కొణిజర్ల ఎస్ఐ సూరజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ శాతం మండలాల వారీగా

మండలం	మొత్తం ఓటర్లు	ఓటేసింది	శాతం
బోనకల్	34	34	100
చింతకాని	36	32	88.89
ఏన్కూరు	75	65	86.67
కామేపల్లి	85	81	95.29
కల్లూరు	94	89	94.68
ఖమ్మం రూరల్	488	462	94.67
ఖమ్మం అర్బన్	518	483	93.24
ఖమ్మం అర్బన్	511	471	92.17
ఖమ్మం అర్బన్	487	445	91.38
ఖమ్మం అర్బన్	470	427	90.85
కొణిజర్ల	66	60	90.91
కూసుమంచి	66	61	92.42
మధిర	203	196	96.55
ముదిగొండ	35	33	94.29
నేలకొండపల్లి	55	51	92.73
పెనుబల్లి	63	60	95.24
రఘునాధపాలెం	41	39	95.12
సత్తుపల్లి	277	259	93.50
సింగరేణి	177	168	94.92
తల్లాడ	37	37	100.00
తిరుమలాయపాలెం	34	29	85.29
వేంసూరు	65	64	98.46
వైరా	113	104	92.04
ఎర్రుపాలెం	59	55	93.22
మొత్తం	4098	3805	93.05

టెన్నిస్ డబుల్స్ విజేతలు శశాంక్, అధ్వర్వశర్మ



బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీల డబుల్స్ విభాగం విజేతలుగా తీర్ధ శశాంక్ మాచర్ల(తెలంగాణ), అధర్వశర్మ(మహారాష్ట్ర)జోడీ నిలిచింది. వంశ్‌బిష్ట్(ఢిల్లీ) దేబాసిస్‌సాహ(ఒడిస్సా)ల జోడీ రన్నరప్‌గా నిలిచారు. గురువారం జరిగిన ఉత్కంఠ ఫైనల్ మ్యాచ్‌లో తీర్ధ శశాంక్ మాచర్ల(తెలంగాణ) అధర్వశర్మ(మహారాష్ట్ర) జోడీ 6-4, 6-4 స్కోరు తేడాతో జోడి వంశ్‌బిష్ట్(ఢిల్లీ) దేబాసిస్‌సాహ(ఒడిస్సా)ల జోడీపై గెలుపొంది టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. అంతే కాకుండా సింగిల్స్ విభాగంలో ఫైనల్స్ పోటీలను అధర్వశర్మ(మహారాష్ట్ర) వర్సెస్ ఓగేస్ తేజో జయప్రకాశ్(తమిళనాడు)ల మధ్య శుక్రవారం ఉదయం నిర్వహించనున్నారు. పోటీల అనంతరం డబుల్స్ విజేతలకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బహుమతులు ప్రదానం చేశారు.

డబుల్స్ డబుల్స్ సెమీఫైనల్స్‌లో విజేతలు వీరే

వంశ్‌బిష్ట్(ఢిల్లీ) దేబాసిస్‌సాహ(ఒడిస్సా)ల జోడీ 3-6, 7-6, (11-9) స్కోరు తేడాతో ట్రైబ్రేక్‌లో ఓగేస్ తేజో జయప్రకాశ్(తమిళనాడు) ఉదిత్‌కంబోజ్(హర్యానా)ల జోడీపై విజయం సాధించగా, తీర్ధ శశాంక్ మాచర్ల(తెలంగాణ) అధర్వశర్మ(మహారాష్ట్ర) జోడీ 6-4, 6-1 స్కోరు తేడాతో ఆదిత్యవర్ధన్, నైషిక్‌రెడ్డి(తెలంగాణ)జోడీపై విజయం సాధించారు.

కల్యాణం.. కమనీయం



పెళ్లి పీటలపై భట్టి, రాందాస్ నాయక్ దంపతులు

వైరా, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, లలిత దంపతులు పెళ్లిపీటలపై కూర్చొని ఈ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం రాత్రి 11గంటలకు మొదలైన కల్యాణ ఘట్టం అర్ధరాత్రి 2గంటల వరకు సాగింది. దాదాపు మూడుగంటలపాటు కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. భట్టి విక్రమార్క, రాందాస్‌నాయక్ దంపతులు కల్యాణఘట్టం చివరి వరకు సంప్రదాయ రీతిలోనే జరిపించారు. వైరా పరిసర ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులు ఈ కల్యాణాన్ని తిలకించారు.

కెనడా అంతర్జాతీయ పోటీల్లో..

‘పేట’ చిన్నారికి బహుమతి



అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తెలుగు తల్లి కెనడా, గడుగ్గాయి పిల్లల మాసపత్రిక అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన బాలకథా రచయిత సిద్ధాంతపు సాత్విక్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలుగువారి పిల్లల నుంచి కెనడాకు చెందిన గడుగ్గాయి ప్రపంచ పిల్లల పత్రిక సంపాదకవర్గం కథలను ఆహ్వానించింది. కథల పోటీల్లో అశ్వారావుపేటకు చెందిన సాత్విక్ రాసిన నిజాయితీ విలువ అనే కథను పంపారు. ఈ కథను ప్రత్యేక బహుమతికి ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని సాత్విక్‌కు పంపారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో తనకు బహుమతి రావటం ఎంతో ఆనందంగా ఉందని సాత్విక్ తెలిపారు. నిర్వాహకులు, సంపాదకవర్గ సభ్యులు చదలవాడ ఉదయశ్రీ, లావణ్య, లక్ష్మీలకు ధన్యవాదాలు తెలిపారు. చిన్నారి సాత్విక్ బహుమతి గెలుచుకోవటం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

9న రవన్న వర్ధంతి సభ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రెండు దశాబ్దాల పాటు అజ్ఞాత జీవితాన్ని గడిపి ప్రజా పోరాటాలు చేస్తూ కామ్రేడ్ రాయల సుభాష్‌చంద్రబోస్(రవన్న) ప్రాణత్యాగం చేశారని, నేటి సమాజంలో ఉన్న ఫాసిజంపై పోరాటాలు సాగించేందుకు యువత ముందుకు రావాలని రాయల సుభాష్ చంద్రబోస్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వడ్డేల్లి కృష్ణమూర్తి, చైర్మన్ గుర్రం అచ్చయ్య పేర్కొన్నారు. గురువారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రవన్న వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 9న ఖమ్మంలో పెద్ద ఎత్తున పూర్వ ఉద్యమకారులతో కలిసి రవన్న వర్ధంతి సభను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ట్రస్ట్ కోశాధికారి రామారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేం దర్, రవికుమార్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు వెంకయ్య, సీవై పుల్లయ్య, రామయ్య, అశోక్, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, శివలింగం పాల్గొన్నారు.

సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాల విడుదల

అశ్వాపురం ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సాగరు ఆయకట్టుకు గురువారం బీజీ కొత్తూరు సీతారామా పంప్‌హౌస్‌ద్వారా అధికారులు గోదావరి జలాలను విడుదల చేశారు. రబీలో సాగరు ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించటంతో అధికారులు దిగువకు నీటిని విడుదల చేశారు. ఇటీవల కలెక్టర్ జితేష్ వి పాటిల్ మండలంలో పర్యటించి సీతారామా ప్రాజెక్ట్‌కు సంబంధించిన బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌తోపాటు, దుమ్ముగూడెం ఆనకట్టవద్ద నీటి నిల్వలను పరిశీలించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి లభ్యత తక్కువగా ఉండటంతో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకుఎగువన ఉన్న తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్ నుంచి 1200 వందల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అవి దుమ్ముగూడెం ఆనకట్టకు చేరుకోవటంతో అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు.

ఆర్టీసీకి నీలాద్రి ఆదాయం రూ.8,18,358లక్షలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా రెండు రోజుల పాటు పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వరాలయానికి బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.8,18,358లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎం యూ.రాజ్యలక్ష్మీ గురువారం తెలిపారు. మొత్తం 24ప్రత్యేక బస్సులను నడపగా 8911కిలోమీటర్లు ప్రయాణించినట్లు చెప్పారు. 165ట్రిప్పులు వేయగా ఈపీకే 91.8శాతం సాధించగా ఆక్యూపెన్సీ రేషియో 143గా ఉందని, ఈపీబీ 32,734 వచ్చిందన్నారు. డిపోకు ఆదాయం తెచ్చేందుకు సహకరించిన డ్రైవర్లు, కండక్టర్లతోపాటు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

తుమ్మల చొరవతో స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్

- కాకినాడకు ప్రారంభమైన బొగ్గు రవాణా
- రోజుకు 200ల లారీల్లో ఆరు వేల టన్నులు
- ఊపిరి పీల్చుకున్న లారీ యజమానులు



తుమ్మలకు వినతిపత్రం సమర్పిస్తున్న నాగేశ్వరరావు

సత్తుపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గనుల నుంచి కాకినాడ వరకూ బొగ్గు రవాణా గురువారం తిరిగి ప్రారంభమైంది. రోజుకు రెండొందల లారీల్లో ఆరు వేల టన్నుల బొగ్గును రవాణా చేస్తున్నారు. గత నెల రవాణా నిలిచిపోవటంతో సత్తుపల్లి లారీ, టిప్పర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రావి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో లారీ యజమానులు రాష్ట్ర మంత్రి తుమ్మలను ఇటీవల కలసి సమస్యను వివరించి లోడింగ్ ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి తుమ్మల సింగరేణి సంస్థ సీఎండీతో మాట్లాడారు. లారీ యజమానుల సమస్యను పరిష్కరించాలని, లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని సూచించారు. దీంతో సీ అండ్ ఎండీ జోక్యంతో గురువారం తిరిగి బొగ్గు రవాణా కాకినాడ వరకూ ప్రారంభమైంది.

ఆగుతూ...సాగుతున్న రవాణా

సత్తుపల్లిలోని బొగ్గుగనుల నుంచి లారీల ద్వారా కాకినాడకు 2023 వరకూ సజావుగా సాగిన రవాణా గతేడాది మొత్తం దాదాపు నిలిచిపోయింది. దీంతో లారీ యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గుగనుల కోసం భూ సేకరణలో భూములు కోల్పోయిన వారు 200 మంది వరకూ లారీలు కొనుగోలు చేసి తిప్పుతున్నారు. వీరు కాక మరో 500లారీలున్నాయి. గత కొన్నేళ్లుగా బొగ్గు లోడింగ్ సరిగా లేక, బొగ్గు రైల్వే లైను ద్వారా తరలించటం, కిరాయిలు సక్రమంగా లేకపోవటంతో లారీలు అమ్ముకున్నారు. మిగిలిన లారీ యజమానులు కూడా కిరాయిలు సక్రమంగా లేక ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. తమకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లారీ టిప్పర్ యజమానుల సంఘం ఆధ్వర్యంలో పలు పర్యాయాలు ఆందోళనలు కూడా చేసారు. 2023లో నిలిచిపోయిన కాకినాడ బొగ్గు రవాణా గతేడాది డిసెంబర్‌లో మంత్రి తుమ్మల, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనతో బొగ్గు రవాణా ప్రారంభించారు. అప్పట్లో వంద లారీల్లో 30వేల టన్నుల బొగ్గు రవాణా జరిగింది. లారీ కిరాయిలు దొరుకుతున్నాయని సంతోషపడే లోపుగానే మళ్లీ రవాణా నిలిపేసారు. నెల రోజులుగా బొగ్గు రవానా నిలిచిపోవటంతో ఇటీవల లారీ, టిప్పర్ వేల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు తుమ్మలను కలిసిన మేరకు గురువారం బుధవారం బొగ్గు లోడింగ్ ప్రారంభమైంది. ఇది ఎన్ని రోజులు కొనసాగుతుందనేది ఒక పక్క. లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. బొగ్గు రవాణా కోసం ఎదురు చూస్తున్న లారీ యజమానుల అవసరాలను గుర్తించి కిరాయి కూడా తగ్గించిన విషయం విదితమే. గతంలో కాకినాడకు టన్నుకు రూ.795లు చెల్లించగా దానిని గత డిసెంబర్ నుంచి టన్నుకు రూ.785కు తగ్గించారు. ప్రతి ఏటా కిరాయిలు పెంచాల్సింది పోయి ఖర్చుల పేరుతో తగ్గించారని, బొగ్గు రవాణా నిలిపివేస్తుండటంతో మళ్లీ కిరాయిలు తగ్గించే అవకాశం ఉందా అనే ఆందోళన లారీ యజమానుల్లో వ్యక్తం అవుతోంది. మొత్తంగా మంత్రులు జోక్యం చేసుకుంటే తప్ప స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ దొరికే పరిస్థితి లేకుండా పోయింది.

మునిసిపల్ అభివృద్ధికి..

డ్రోన్ సర్వేతో మాస్టర్ ప్లాన్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మునిసిపాలిటీ అభివృద్ధికి డ్రోన్‌తో సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. గురువారం ఐడీవోసీ కార్యాలయ ఆవరణలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, మునిసిపల్ అధికారులు, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, డీటీసీపీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్‌కు పూజ చేసి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా మునిసిపాలిటీకి సమస్యలు లేని మాస్టర్‌ప్లాన్ తయారు అవుతున్నదని, భవిష్యత్ తరాలకు అన్నీ డిజిటలైజ్ చేయడమే లక్ష్యమన్నారు. లేటెస్ట్ టెక్నాలజీ డ్రోన్ కెమేరాల సాయంతో పాల్వంచ మునిసిపాలిటీ మాస్టర్‌ప్లాన్ డిజిటల్ సర్వే పకడ్బందీగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ -2.0 స్కీం కింద రాష్ట్రంలో 50 వేల నుంచి లక్ష జనాభా కలిగిన 20 మునిసిపాలిటీలను మాస్టర్‌ప్లాన్ డిజిటల్ సర్వే చేయడంలో భాగంగా పాల్వంచ మునిసిపాలిటీని ఎంపిక చేసామన్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా పాల్వంచ మునిసిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. మాస్టర్‌ప్లాన్ సర్వే సాయంతో పాల్వంచ పట్టణం అభివృద్ధి చెందుతుందని, చాలా సంవత్సరాల క్రితం రూపొందించిన ప్రణాళికలను ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా మార్చేందుకు ఈ డిజిటల్ సర్వే ఉపయోగపడనుందన్నారు. ఈ సర్వేలో ఉపగ్రహాలు, డ్రోన్‌ల సాయంతో మునిసిపాలిటీల పరిధిలోని ప్రాంతాల వారీగా ఉపరితలం ఎత్తు, పరిస్థితులు, రోడ్లు, ఇళ్ళు, డ్రైనేజీ, త్రాగునీటి పైపులైన్లు, సెల్ టవర్స్, టాయిలెట్స్, రిజర్వాయర్లు, మార్కెట్‌లు, వైకుంఠ ధామాలు లాంటి ప్రతిదీ చిత్రాలతో విభాగాల వారీగా సేకరించి బేస్ మ్యాపులను తయారు చేస్తామన్నారు. కొత్త మాస్టర్‌ప్లాన్ ఆధారం చేసుకుని భవిష్యత్ అవసరాలకు తగినట్లు అధికార యంత్రాంగం కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించే పనిలో నిమగ్నమైందన్నారు. పట్టణాల అభివృద్ధితో పాటు తలెత్తే సమస్యల పరిష్కారంలో ఈ బేస్ మ్యాపులే కీలకం కానున్నాయని అన్నారు. కార్యక్రమంలో డీటీసీపీవో సత్యనారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

60 ఏళ్ల తరువాత ఆత్మీయ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెనుబల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ ఉన్నత పాఠశాలలో 1964-65పదోతరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 60ఏళ్ల క్రితం విద్యారంగానికి ఎలాంటి అవకాశాలు లేని రోజుల్లో పెనుబల్లి(వీఎంబంజర్)లో అప్పటి ప్రజాప్రతినిధిగా ఉన్న దివంగత జలగం వెంగళరావు ప్రత్యేక చొరవ తీసుకోవడం వలన ఈ పాఠశాల రూపుదిద్దుకుంది. అప్పటి పదోతరగతి బ్యాచ్‌లో 11మంది విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాటి స్మృతులను నెమరవేసుకున్నారు. ఈ పాఠశాల ఏర్పడకపోయినట్లయితే పరిసర గ్రామాల్లోని వేలాదిమంది యువతీయువకులు వ్యవసాయ కూలీలు, వ్యవసాయదారులుగా ఉండేవారమని తెలిపారు. ఆనాటి ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు విద్యార్థులను తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారు. 1964-65,66బ్యాచ్‌లను ప్రధానోపాధ్యాయుడి ప్రత్యేక క్రమశిక్షణ వలన అనేకమంది విద్యార్థులు వివిధ రంగాల్లో సిర్థపడ్డారు. వెంకటేశ్వరరావు అప్పట్లోనే ప్రధానోపాధ్యాయుడిగా పేరుప్రఖ్యాతలు గడించారు. 60ఏళ్ల నాటి పూర్వవిద్యార్థుల్లో వంగా నర్సింహస్వామి, ఏటుకూరి రామారావు, కోటోజు మునేశ్వరరావు, బజ్జూరి వెంకటేశ్వరరావు, దామెర ప్రసాదరావు, ధనుంజయరావు, సోమరాజు నాగభూషణ్‌రావు, పాలెపు అప్పారావు, ఏటుకూరి చిన్న కృష్ణారావు, వంగల రంగాచారి, ఖాజా సాయిబాబుతోపాటు 1963-64బ్యాచ్‌కు చెందిన రామిశెట్టి సుబ్బారావు, పోతుల జగన్మోహన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనాటి స్మృతులను నెమరువేసుకున్నారు. తాము విద్యాభ్యాసం సాగించిన నాటి రోజుల్లో జరిగిన సంఘటలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమం ఆద్యంతం ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు.

నిర్మాణాన్ని నిలిపివేసిన అటవీ అధికారులు

నిర్మాణాల నిలిపివేతపై భక్తుల ఆగ్రహం



ఆగిపోయిన నిర్మాణం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం వద్ద శిధిలమైన షాపింగ్ షెడ్లు పున:నిర్మాణపు పనులను అటవీ శాఖ అధికారులు నిలిపివేయడంతో భక్తుల్లో ఆగ్రహావేశం వ్యక్తం అవుతోంది. అటవీశాఖాధికారుల చర్యలపై స్థానిక భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసారు. అశ్వారావుపేట మండలం, వినాయకపురం సమీపంలో దాదాపు 50 ఏళ్ళ క్రితం నుంచి చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం ఉంది. అప్పట్లో అటవీప్రాంతంగా ఉన్న ఇక్కడ ఆలయాన్ని అప్పట్లో నిర్మించారు. ఆ తరువాత భక్తుల విరాళాలతో ఆలయం వెనుకవైపున వంట చేసుకోవడానికి, భోజనాలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు చేసుకోవడానికి వీలుగ షెడ్లను నిర్మించారు. బోరు, మోటారు, మంచినీటి ట్యాంకును నిర్మించారు. ఆలయం ఎదురుగా బొమ్మలు, కొబ్బరి కాయలు వంటివి అమ్మడానికి షెడ్లు, ఆలయ కార్యాలయం కోసం ఓ గది, పాత ఆలయం వరకు సీసీ రహదారిని నిర్మించారు. ఈ ప్రాంతంలో ప్రతి ఉగాది సమయంలో భారీ సెట్టింగ్‌లతో జాతరను నిర్వహిస్తుంటారు. భక్తులు అధిక సంఖ్యలో రావడం, ఆదాయం పెరగటంతో 2007లోనే ఈ ఆలయాన్ని దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాన్స్‌పార్మర్ కూడా ఉంది. ఇన్ని సంవత్సరాల నుంచి ఎటువంటి ఆటంకం లేకుండా నడిచింది. ఆలయం ఎదురుగా ఉన్న షెడ్లు శిధిలమవ్వడంతో భక్తుల విరాళంతో ఆ షెడ్లను పునర్నిర్మించడానికి ఆలయ కమిటీ పనులు ప్రారంభించింది. తాజాగా ఈ పనులను అటవీశాఖాధికారులు నిలిపివేయడం ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది. అటవీశాఖ పరిధిలో ఈ నిర్మాణాలు ఉన్నాయని, నిర్మాణాలు చేయవద్దంటూ అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులు నిలపివేసారు. దీంతో స్థానికంగా ఉన్న భక్తులు కొందరు ఎన్నో దశాబ్దాలుగ ఉన్న ఈ నిర్మాణాలు ఉన్నాయని, ఇన్నాళ్లు లేని అభ్యంతరం ఇప్పుడు ఎలా వచ్చింది. నిర్మాణాలు ఆపేదిలేదంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేసారు. చిలికి చిలికి గాలివానలా మారక ముందే అధికారులు భక్తుల మనోభావాలను గుర్తెరగాలంటూ భక్తులు అంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు భక్తులు సిద్ధమవుతున్నారు.

మా చిన్న పరిశ్రమలు బతకాలంటే..

బొగ్గు ధర తగ్గించాలి

సింగరేణి సీఎండీకి బొగ్గు వినియోగదారుల విజ్ఞప్తి



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఆధారిత సిమెంట్, స్పాంజ్, ఐరన్ సిరామిక్స్, ఫార్మావంటి పరిశ్రమలు నేటి క్లిష్టమార్కెట్ పరిస్థితులలో మనుగడ సాగించాలంటే సింగరేణి సంస్థ తన బొగ్గు ధరను తగ్గించాల్సిన అవసరం ఉందని విద్యుత్తేతర పరిశ్రమల యాజమాన్యాలు సింగరేణి సంస్థకు మొరపెట్టుకున్నాయి. తమపై ఆధారపడిన వేల మంది స్థానిక చిరు ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా తక్కువ ధరకు బొగ్గును విదేశాల నుంచి, ఇతర బొగ్గు సంస్థల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందన్నారు. తొలిసారిగా అన్ని ఏరియాల జీఎంలు, క్వాలిటీ జీఎంలు, క్వాలిటీ ఇంచార్జీలతో కలిసి సింగరేణిభవన్‌లో గురువారం సంస్థ నిర్వహించిన విద్యుత్తేతర వినియోగదారుల సమావేశంలో దాదాపు 60కి పైగా సంస్థల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. గత ఏడాది సింగరేణి ఉత్పత్తి చేసిన 70 మిలియన్ టన్నుల బొగ్గులో 9మిలియన్ టన్నులను విద్యుత్తేతర వినియోగదారులు కొనుగోలు చేశారని, ఈ ఏడాది కేవలం 5 మిలియన్ టన్నులను మాత్రమే తీసుకోవడానికి కారణాలను సీఎండీ తెలుసుకున్నారు. దీనిపై అన్ని సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ పోటీ మార్కెట్లో ఇప్పటికే తాము ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నామని, సింగరేణి బొగ్గు ధరలు ఎక్కువ ఉన్న కారణంగా తాము అంతకన్న తక్కువ ధరకు లభిస్తున్న కోల్ ఇండి యా, విదేశీ బొగ్గు వైపు మొగ్గు చూపాల్సి వస్తోందని పేర్కొన్నారు.

కోల్ ఇండియా అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారిణి

రుద్రంపూర్, (సింగరేణి) ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో నిర్వహించిన కోల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో సింగరేణి క్రీడాకారిణి మాన్విత తన సత్తాను చాటి మూడుబంగారు పతకాలను సాధించింది. మాన్వితను గురువారం సింగరేణి ఎస్టేట్ జీఎం కార్యాలయంలో తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఎస్టేట్ జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగి మాన్విత క్రీడారంగంలో రాణించి బంగారు పతకాలు సాధించడం సింగరేణి సంస్థకే గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ అంతర్జాతీయ క్రీడాపోటీలో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మాన్విత షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రోలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం వెంకటాచారి, ఎస్టేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మిల్లులో కిందపడి హమాలీ మృతి

నేలకొండపల్లి, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైనంపల్లి సమీపంలోని పద్మావతి శ్రీనివాస పారాబాయిల్డ్ మిల్లులో గురువారం తెల్లవారుఝామున ఓ హమాలీ ఫ్యాక్టరీలో పైనుంచి కిందపడి మృతి చెందాడు. మహమ్మద్ ఇంతియాజ్(51)గత కొన్ని సంవత్సరాలుగా పద్మావతీ శ్రీనివాస పారాబాయిల్డ్ మిల్లులో హమాలీగా పని చేస్తున్నాడు. గురువారం తెల్లవారుఝామున దాదాపు వంద అడుగుల ఎత్తు నుంచి కింద పడి మృతి చెందినట్లు తెలుస్తున్నది. మృతుడు బీహార్‌కు చెందినవాడు. మృతుడు అంత ఎత్తుకు, అదీ తెల్లవారుఝామున ఎందుకు ఎక్కాడనేది ప్రశ్నార్థకంగా ఉంది. గురువారం ఉదయం సమాచారం అందుకున్న నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలుస్తున్నది. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినోభానగర్ గ్రామ సమీపంలో గురువారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురు సింగరేణి ఉద్యోగులకు గాయాలయ్యాయి. కొత్తగూడెం బాబు క్యాంప్‌నకు చెందిన సింగరేణి ఉద్యోగులు ప్రశాంత్, శ్రీనివాస్, తిరుమలరెడ్డి కారులో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్నారు. అదే సమయంలో వైరా మండలం స్నానాల లక్ష్మీపురం శివాలయం ఆలయ ఈవో హరిచంద్రశేఖర్ కారులో ఏన్కూర్ నుంచి జూలూరుపాడు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో రెండు కార్లు వినోభానగర్ గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ముగ్గురు సింగరేణి ఉద్యోగులు ప్రశాంత్, శ్రీనివాస్, తిరుమల రెడ్డిలకు గాయాలయ్యాయి. వారికి వైద్య చికిత్సలందించేందుకు 108లో కొత్తగూడెంలోని సింగరేణి ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలంలో 108 పైలెట్ సంతోష్, ఈఎంటీ మాధవిలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్సను చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు.

ఇద్దరికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ, ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలవ్వగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన గురువారం సత్తుపల్లి మండలం కొత్తూరు రైతువేదిక వద్ద చోటుచేసుకుంది. బేతుపల్లికి చెందిన సిద్దిని నాగరాజు, గౌరిగూడెంకు చెందిన పుచ్చ పుల్లారావు దగ్గరి బంధువులు. ఇద్దరూ కలిసి సత్తుపల్లి నుంచి పెట్రోల్‌తో పాటు కర్రీ పార్శిళ్ల తీసుకుని తిరుగుప్రయాణంలో కొత్తూరు మీదుగా వెళ్తున్నారు. గ్రామంలోని రైతువేదిక వద్దకు చేరుకోగానే మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీ, ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇరువురిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం నాగరాజును ఖమ్మం తరలించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాలను స్టేషన్‌కు తరలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దమ్మపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ప్రధాన రహదారి మండలపల్లి క్రాస్ రోడ్ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేట పరిధిలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన రమేష్ ద్విచక్రవాహనంపై సత్తుపల్లి వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్ తలకు బలమైన గాయం కావటంతోపాటు తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి దమ్మపేట వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి

టేకులపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): దివంగత నేత, మాజీ శాసన సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ పూనెం రామచంద్రయ్య సతీమణి పూనెం పుల్లమ్మ(80) అనారోగ్యంతో బుధవారం మండలంలోని కోయగూడెం గ్రామంలో వారి స్వగృహంలో మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహానికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కరకగూడెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి పంచాయతీ గుబ్బలమంగమ్మ ఆలయం పరిసరాల్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు గురువారం కరకగూడెం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను, నాలుగు సెల్ ఫోన్లు, 5ద్విచక్ర వాహనాలు, రూ.7500 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏ అర్హత లేకుండా ఓ ఆర్ఎంపీ డాక్టర్ నడిపిస్తున్న క్లీనిక్‌తో పాటు ఫార్మసీని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి గురువారం సీజ్‌చేశారు. బెడ్లు వేయడం, ఇంజక్షన్లు చేయడం, సెలైన్ ఎక్కించడం చట్టరీత్యా నేరమని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇల్లిల్లూ తిరిగి ప్రాక్టీస్ చేసుకోవాలే గానీ ఇలా బెడ్లు వేసి ట్రీట్‌మెంట్ ఇవ్వకూడదన్నారు. ఇప్పటికే నోటీసులు ఇవ్వగా తీరులో మార్పు రాకపోవడం, నిబంధనలు లేకుండా మెడికల్ షాప్ నిర్వహిస్తూ మందులు ఇవ్వడం నేరమని, అందుకే వైద్యశాలతో పాటు మెడికల్ షాప్‌ను సీజ్ చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే ఆసుపత్రికి వచ్చి రోగులను సైతం ఆమె ప్రత్యేకంగా విచారించి వివరాలను సేకరించారు. అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా గంగారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ చందూనాయక్, డీఎంఓ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తలారి సీతారామ్, గంగారం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్.అవినాష్ ఉన్నారు.



ప్రభుత్వ భూములు గుర్తించాలి

పాలేరు నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేష్

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూడాలని నియోజకవర్గ స్పెషలాఫీసర్ రమేష్ తెలిపారు గురువారం తహసీల్దార్‌కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి సరిహద్దులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో చేపడుతున్న గ్రానైట్ తవ్వకాల వివరాలను కూడా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.





తీర్థాలలో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

వైభవంగా శివపార్వతుల రథోత్సవం

- కూసుమంచి గణపేశ్వరాలయ ఆదాయం రూ.12.30లక్షలు
- తీర్థాలకు రెండోరోజూ పోటెత్తిన భక్తులు
- కలెక్టర్ ప్రత్యేక పూజలు

కూసుమంచి/ఖమ్మంరూరల్, మార్చి10: మహాశివరాత్రి పురస్కరించుకుని కూసుమంచి గణపేశ్వరాలయానికి ఈఏడాది సుమారు రూ.12.30లక్షల ఆదాయం లభించింది. ఆలయ ఈవో శ్రీకాంత్, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు అందరి సమక్షంలో గురువారం లెక్కించారు. బహిరంగ వేలం పాటలద్వారా రూ.2,34,500,దుకాణాల ఏర్పాటు ద్వారా రూ.69.300, అర్చనప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేకదర్శనం ద్వారా 2,77,691, హుండీల ద్వారా రూ.3,73,391, కల్యాణకట్టాల ద్వారా రూ.13,800, విరాళాల ద్వారా రూ.2,61,700 ఆదాయం లభించినట్లు ఎండోమెంట్ అధికారులు, పాలకమండలి సభ్యులు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే పెద్ద తేడా ఏమీలేనట్లు సభ్యులు తెలిపారు.

వృథా ఖర్చు పట్ల భక్తుల అసహనం

ఇదిలా ఉండగా మహాశివరాత్రి ఉత్సవంలో భక్తులు ఇచ్చిన కానుకలు, విరాళాలను దేవాలయ అభివృద్ధికి ఉపయోగించకుండా ఎండోమెంట్ అధికారులు కొంత వృథాగా ఖర్చు చేస్తున్నారని భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రథోత్సవంలో డీజే వాహనాలు రెండు ఏర్పాటు చేశారని, అవసరమా అంటూ ప్రశ్నించారు. గత ఏడాది మూడు ఏర్పాటుచేస్తే భక్తులనుంచి వ్యతిరేకత వచ్చిన.. అధికారులు తీరు మార్చుకోలేదు. కొత్తగా ఏర్పాటైన పాలకవర్గం ఆ దిశలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా శివపార్వతుల రథోత్సవం

మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రసిద్ధిగాంచిన కాకతీయుల గణపేశ్వరాలయంలో శివపార్వతుల రథోత్సవాన్ని (నగరసంకీర్తన) గురువారం రాత్రి నిర్వహించారు. శివపార్వతుల విగ్రహాలను రథంలో ఉంచి గణపేశ్వరాలయం నుంచి బస్టాండ్‌సెంటర్ వరకు ఊరేగించారు. హరహర శంభోశంకర, ఓంనమశ్శివాయ అంటూ పెద్దసంఖ్యలో శివభక్తులు రథంలో ఊరేగిస్తూ భక్తులను కనువిందుచేశారు.



ఖమ్మంలో గ్రామోత్సవంలో భాగంగా కోలాటం వేస్తున్న మహిళలు



కూసుమంచిలో రథోత్సవం

తీర్థాలలో కలెక్టర్ పూజలు

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాల జాతరకు రెండోరోజు గురువారం భక్తులు పోటెత్తారు. మంగళవారంరాత్రి ఆలయ ప్రాంగణంలో నిద్ర చేశారు. మంగళవారం రాత్రి జరిగిన స్వామివారి కల్యాణ వేడుకను తిలకించారు. గురువారం ఉదయం త్రివేణి సంఘమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. అయితే దూర ప్రాంతాల నుంచి రెండో రోజుకూడా భక్తులు పెద్ద ఎత్తున తీర్థాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివా ఉత్సవ విగ్రహలను పురవీధుల్లో ఊరేగించారు. కలెక్టర్ ముజమ్మిల్ స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లపై స్థానికులతో మాట్లాడారు.

గుంటు మల్లేశ్వరుడి గ్రామోత్సవం

ఖమ్మం ఖానాపురంహవేలి: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గుంటు మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం కన్నుల పండుగగా జరిగింది. విద్యుత్ కాంతుల నడుమ, మహిళలు కోలాటనృత్యాలతో, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం వీరస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరు వీరభద్ర శర్మ, కృష్ణ శర్మ, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.





తీర్థాలలో హాజరైన భక్తులు, కూసుమంచిలో..

పూణేకు కార్పొరేటర్లు

- వ్యర్థాల నిర్వహణపై పరిశీలన
- 5నుంచి 8వరకు పర్యటన
- మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, అధికారుల పర్యటన



ఖమ్మంసంక్షేమ విభాగం,ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, అధికారులు మహారాష్ట్ర రాష్ట్రంలోని పూణే నగరాన్ని పరిశీలించనున్నారు. అక్కడ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ అంశాలను వారు పరిశీలించనున్నారు. ఈమేరకు రాష్ట్ర పురపాలక సంస్థ(సీడీఎంఏ) నుంచి అనుమతి జారీ జరిగింది. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య టూర్ ఏర్పాట్లు ప్రారంభించారు. మార్చి 5నుంచి 8వరకు పర్యాటన సాగనుంది.

స్టడీ టూర్

మహారాష్ట్రలోని పూనే పరిశుభ్ర నగరంగా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. స్మార్ట్ శానిటేషన్ సిటీగా ప్రత్యేకతను చాటుతోంది. ఆరోగ్యం, పారిశుధ్యంపై అనేక రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఘన, ధృవ, మల వ్యర్థాల నిర్వాహణతో పాటుగా సద్వినియోగంలో పూనే మంచి గుర్తింపును పొందింది. కంపోస్టింగ్, వ్యర్థాల రవాణా, బయో గ్యాస్ ఉత్పత్తి, బయో మైనింగ్ నిర్వహణలో జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది.

బయో మైనింగ్‌లో ఖమ్మం ఆదర్శం

విద్యా,వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం వంటి అనేక అంశాల్లో అభివృద్ధిలో ముందున్న ఖమ్మంనగరానికి రోజువారీ పారిశుధ్య నిర్వాహణ సమస్యగా మారింది. ముఖ్యంగా డంపింగ్‌యార్డు నిర్వాహణ పదేళ్లుగా పెద్ద సమస్యగా ఉంది. ఇటీవల డంపింగ్‌యార్డును బయో మైనింగ్ ద్వారా శుద్ధి చేసి 30ఎకరాలకు పైగా భూమిని డంపింగ్‌యార్డు నుంచి బయటకు తీసి వాటిలో వన సంరక్షణ చేపట్టారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో డంపింగ్ బయో మైనింగ్‌లో ఖమ్మం ఆదర్శంగా ఉంది.

పూణేలో పరిశీలన ఇలా

అయితే వ్యర్థాల నిర్వాహణ ఎప్పటికప్పుడు చేపట్టి వాటి నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాలను, ఇతర వస్తువులను తయారు చేసేందుకు పూనేలో ఖమ్మం పాలకవర్గం పరిశీలన చేయనున్నారు. వీటితో పాటుగా ఘన, ధృవ, మల వ్యర్థాల నిర్వాహణపై పూనేలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు. మురుగునీరు మెనేజ్‌మెంట్, తిరిగి వినియోగంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నారు. ఎవ్వరి ఇంట్లో చెత్తను వారే తడి, పొడి చెత్తగా మార్చుకొని వాటి నుంచి గ్యాస్ ఉత్పత్తిని పరిశీలిస్తారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించటం, ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయాలు ఏర్పాటు, ప్లాస్టిక్ పూర్తిగా నిరోధించటంపై క్షేత్రస్థాయిలో అవగాహన తీసుకొనున్నారు. అలాగే సఫాయి మిత్ర విధానాల ద్వారా మల వ్యర్థాల నిర్వాహణ, బయోగ్యాస్ ఉత్పత్తి, సద్వినియోగంపై మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన కార్పొరేటర్లు స్టడీ టూర్‌ను ఏర్పాటు చేశారు.

మార్చి 5నుంచి 8వరకు పర్యటన

మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో పాలక వర్గంలోని కార్పొరేటర్లకు రెండురోజులుగా సమాచారం అందిస్తున్నారు. వీరిలో 43మంది కార్పొరేటర్లు హాజరవుతున్నారు. వారికి తోడుగా ఉండేందుకు కేఎంసీలోని ఒక్కో విభాగంనుంచి ఒక్కోఅధికారిని పంపుతున్నారు. మార్చి5న ఖమ్మం నుంచి పర్యాటన ప్రారంభం కాగా 8వతేది రాత్రికి తిరిగి ఖమ్మం చేరుకోనున్నారు. ఈ మేరకు కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో పర్యాటన ఖరార్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

రూరల్‌లో 488 ఓట్లకు 461 ఓట్లు పోలింగ్

ఖమ్మంరూరల్:మండలంలో గురువారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జలగంనగర్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 488 ఓట్లు ఉండగా 461 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 27మంది ఓటు వేయలేదు. రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

రఘునాథపాలెంలో 39 ఓట్లు పోలింగ్

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 41ఓటర్లుకుగాను 39మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహసీల్దార్ లూధర్‌విల్సన్ పర్యవేక్షణ చేయగా సీఐ షరీఫ్ బందోబస్తు తదితరులు నిర్వహించారు.

కామేపల్లిలో 81 ఓట్లు

కామేపల్లి:మండలంలో తహసీల్దార్ సుధాకర్ పర్యవేక్షణలో 85మంది ఓటర్లకుగాను 81 మంది ఓటుహక్కును వినియోగిం చుకున్నారు. కామేపల్లి ఎస్ఐ బి.సాయికుమార్‌పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను బసు ద్వారా తరలించారు.

తిరుమలాయపాలెంలో 29 ఓట్లు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 34మంది ఓటర్లకు గాను 29మంది ఓటువేశారు. ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సెక్టార్ ఆఫీసర్ సాయినాథ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూసుమంచిలో61 ఓట్లు

కూసుమంచి: మండలంలో 66మందికి 61 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. తక్కువమంది ఓటర్లు ఉండటంతో అడపాదడపా ఓటర్లు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కూసుమంచి తహసీల్దార్ కరుణశ్రీ ఎన్నికలను పర్యవేక్షించారు.

గీతాంజలిలో సైన్స్ఎక్స్‌పో

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): నగరంలోని గీతాంజలి పాఠశాలలో గురువారం సైన్స్ఎక్స్‌పో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ అప్పారావు, డైరెక్టర్ అరుణ్, పద్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన శాటిలైట్ కమ్యూనికేషన్ సిస్టం, ఎలక్ట్రికల్ లిఫ్ట్, తదితర ప్రాజెక్టులను ఆకట్టుకున్నాయి.



యాత్ర మహోత్సవాలు ప్రారంభం



ఖమ్మంరూరల్,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని కరుణగిరి ప్రాంగణంలో గురువారం కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. కరుణగిరి చర్చివద్ద ఖమ్మం మేత్రాసనం బిషప్ సగిలి ప్రకాష్ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాలో ఈ మహోత్సవాలకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మాథ్యూ వరప్రసాద్ పాల్గొన్నారు.

మంచుకొండ వైద్యాధికారిగా బాలకృష్ణ

- ఏడాదిలో ముగ్గురు వైద్యాధికారుల మార్పు



రఘునాథపాలెం,ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే వివాదస్పదంగా మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిలుస్తోంది. 80వేలకు పైగా జనాభా పీహెచ్‌సీ పరిధిలో ఉంటుంది.ఖమ్మం అర్బన్‌తో పాటుగా రఘునాథపాలెం మండలంలోని 37 గ్రామ పంచాయతీలలో 12ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది మంచిగా పనిచేసినా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయటంలో మాత్రం వెనుకబడి ఉంటుంది. ఇటువంటి పలు కారణాలతో ఏడాదికి ముగ్గురు వైద్యులు మారిన ఘన చరిత్ర మంచుకొండ ఆరోగ్య కేంద్రానికి ఉంది. ఇక్కడ డాక్టర్‌గా పని చేసిన బాలకృష్ణ ఏడాది క్రితం అనూహ్యంగా బదిలీ చేసి శ్రీదేవికి బాధ్యతలు కేటాయించారు. తర్వాత డాక్టర్ రమేష్‌కు డ్రాయింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు ఇచ్చారు. వివాదాలు ఏర్పటంతో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటరమణకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. కాగా గురువారం గతంలో పనిచేసిన బాలకృష్ణకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా పూర్తి స్థాయిలో బాధ్యతలు కేటాయించారు. నేరుగా ఆరోగ్య ఉపకేంద్రాలకు వెళ్లి ఏఎన్ఎంలను సమన్వయం చేసుకుంటూ వైద్యసేవలు అందిస్తారని డాక్టర్ బాలకృష్ణకు మంచి గుర్తింపు ఉంది.

ముచ్చర్లలో మిర్చి దొంగల హల్‌చల్

- బస్తాల్లో ఎత్తుకెళుతుండగా పట్టుకోబోయిన రైతు
- బైక్ వదిలి పారిపోయిన దొంగలు

కామేపల్లి, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మిర్చిని బస్తాలోకి ఎత్తుకొని పోతుండగా రైతును చూసి దొంగలు పరారయ్యారు. కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన జాల శివక్రిష్ణ ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి తోట వేశాడు. మిరప కాయలను కల్లంలో ఆరబోశాడు. బుధవారం మహాశివరాత్రి కావడంతో కూడలి జాతరకు వెళ్లి రాత్రి పది గంటలకు తిరిగి వచ్చాడు. గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కల్లం దగ్గరకు వెళ్లాడు. దొంగలు 8బస్తాల్లో మిరప కాయలు నింపుకున్నారు. అనుమానంతో చుట్టు పక్కల చూడగా ఓచేనులో కొందరు పరారు అయ్యారు. కాగా వాళ్ల తెచ్చుకున్న ఎలక్ట్రిక్ బైక్ వదిలి పెట్టి పారిపోయారు. ఈ సంఘటనపై శివక్రిష్ణ స్థానిక పోలీస్ స్టేషన్‌లక్ష ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశారు.



దొంగలు వదిలి వెళ్లిన వాహనం

ఆదేశాలు పట్టించుకోని అధికారిపై వేటు

ఖమ్మంసంక్షేమవిభాగం ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేసిన ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. ఖమ్మం నగర పాలకసంస్థలో డి.మాధవి పబ్లిక్ హెల్త్‌వర్కర్‌గా నియామకం జరిగింది. కాగా కొన్ని కారణాలవల్ల కొంతకాలంగా ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో నాల్గో తరగతి ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తోంది. కాగా ఇటీవల పరిపాలనలో భాగంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆమెను పబ్లిక్ హెల్త్ రెగ్యులర్ విధులు కేటాయించారు. ఆదేశాలను పట్టించుకోకుండా కేఎంసీ కార్యాలయంలోనే అనధికారికంగా ఉంటున్నారు. దీంతో విచారణ చేపట్టిన కమిషనర్ మాధవిపై సస్పెషన్ వేటు వేశారు. ఈ సంఘటన కేఎంసీ ఉద్యోగులలో చర్చనీయాంశంగా మారింది.

క్రికెట్ పోటీలకు మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌ను సన్మానిస్తున్న పాలేపు వెంకటరమణ, యువకులు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని 44వ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు పాలేపు వెంకటరమణ ఆధ్వర్యంలో ముస్లిం యువత ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజను ఆహ్వానించారు. ఖమ్మం కేఎంసీ కార్యాలయంలో గురువారం మేయర్‌ను కలిసిన నాయకులు ఆమెను సన్మానించారు. ఈనెల 28నుంచి వారం రోజులు పాటుగా ఖమ్మంలోని పెవిలియన్ మైదానంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు జరుగుతున్నాయని వివరాచారు.ఈ పోటీలను ప్రారంభించేందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా పెవిలియన్ మైదానంలో సమస్యలను వివరించారు. నాయకులు ఎస్కే మోహిన్, సర్దార్ జీ, జలీల్, ఖలీల్, సతీష్, నాగుల్ మీరా, జానీ, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నేలకొండపల్లి, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని ఎస్సీబీసీ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏఈ రామారావు గురువారం ప్రారంభించారు.విద్యుత్ సరఫరాలో వస్తున్న అంతరాయాలను గమనించిన ఏఈ రామారావు ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్తట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ఛార్జి చేశారు. దీంతో కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ఉండటంతో పాటుగా లోఓల్టేజ్ సమస్య కూడా ఉండదని ఏఈ చెప్పారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఏఎల్ఎం సురేష్, ఎల్ఎం రామకృష్ణ, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



ఘనంగా శివపార్వతుల కల్యాణం



కారేపల్లిలో శివలింగం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

నీలాద్రీశ్వరుని ఆలయంలో...

పెనుబల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నీలాద్రీ కొండపై నీలాద్రీశ్వరుడు, బాలత్రిపుర సుందరి దేవి కల్యాణాన్ని లింగోద్భావ సమయంలో అత్యంత వైభవంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. 50జంటలు పీటలపై కూర్చోని కల్యాణాన్ని నిర్వహించారు. వేలాదిమంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో పాకాల వెంకటరమణ పర్యవేక్షణలో నిర్వహించారు.

నీలాద్రీశ్వర దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కల్లూరు ఏసీపీ రఘు పర్యవేక్షణలో సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తి లింగం గౌడ్ పర్యవేక్షించారు. వీటితోపాటు 2.25లక్షల రుద్రాక్షలతో ఏర్పాటుచేసిన 14అడుగుల శివలింగం అభిషేకం అనంతరం రుద్రాక్షలను భక్తులకు అందజేయడంలో రూరల్ సీఐ ముత్తి లింగం, వీఎం బంజర్ ఎస్ఐ కె.వెంకటేష్ ప్రత్యేక చొరవ తీసుకొని పంపిణీ చేయడంతో భక్తులకు రుద్రాక్షలు అందాయి.

మృత్యుంజయ స్వామి ఆలయంలో...

మధిరటౌన్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మధిర లోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ మృత్యుంజయ స్వామి దేవాలయంలో బుధవారం రాత్రి 12 గంటలకు స్వామి వారు అమ్మ వార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రాయప్రోలు సత్యనారాయణ ఆధ్వర్యంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు పలువురు దంపతులు కళ్యాణం లో పీటలపై కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహనరావు తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు

కొనసాగుతున్న కోటిలింగాల జాతర

కారేపల్లి, ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కోటిలింగాల జాతర రెండో రోజు కూడ కొనసాగుతుంది. జాతరకు ఖమ్మం జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. జాతర శుక్రవారంతో ముగుస్తుందని ఆలయ చైర్మన్ ఆలెం వెంకటేశ్వర్లు తెలిపారు.



నీలాద్రీశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మధిరటౌన్‌లో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుబల్లిలో హాజరైన భక్తులు

మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



మిర్చి కల్లాన్ని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

మధిర రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చిబోర్డు ఏర్పాటు చేసి క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం మిరప రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం మధిర మండలం సిరిపురం, మల్లారం గ్రామాల్లో రైతుల మిర్చి కల్లాలను రైతుసంఘం నాయకులు పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి మూడోతేదీన ఖమ్మం కలెక్టరేట్ వద్ద రైతుసంఘాల సమష్టి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు మందా సైదులు, శీలం నర్సింహారావు, మందడపు ఉపేంద్ర, వీరాచారి, రాధాకృష్ణ, రంగారావు, రాజేష్ పాల్గొన్నారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కల్లూరు, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరువంచ గ్రామ పంచాయతీ ఆవరణలో అక్రమంగా చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కీసర రవీందర్ రెడ్డి, కీసర వంశీరెడ్డి, మట్టెల సమ్మెష్, అనిల్ ప్రభుత్వ అధికారులను కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఆవరణలో ఏన్నో ఏళ్లుగా నీడ నిస్తున్న చెట్లను ఎటువంటి అనుమతి లేకుండా గుర్తుతెలియని వ్యక్తులు నరకటాన్ని వారు తప్పు పట్టారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజు వివరణ ఇస్తూ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న రామాలయం మెట్లకు చెట్ల కొమ్మలు అడ్డువస్తున్నాయని భక్తులు తెలిపారని, అదే విధంగా పంచాయతీ పక్కనే ఉన్న ఇళ్ల మీదకు చెట్టుకొమ్మలు వాలిపోయి ఉన్నాయని వీటిని తొలిగించాలని దరఖాస్తు చేసుకోగా ఈ నెల 20న తమ సిబ్బంది పర్యవేక్షణలో చెట్ల కొమ్మల వరకే తొలిగించామన్నారు. కాగా 21న పంచాయతీ కార్యాలయంలో ఎవరు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పంచాయతీ ఆవరణలో నీడనిచ్చే నాలుగు చెట్లను అక్రమంగా నరికినారని చెప్పారు. ఈ విషయమై తాము ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశామని కార్యదర్శి రాజు విలేకరులకు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1978వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు

చింతకాని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 47 ఏళ్ల తరువాత వారంతా ఒకే వేదికగా కలిశారు. నాటి మధుర జ్ఞాపకాలను, చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఈ అపూర్వ కలయిక చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977-78లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఒకరి యోగక్షేమాలను ఒకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంకాయలపాటి రామకృష్ణ, అంబటి శాంతయ్య, వంకాయలపాటి సత్యం, బల్లి వీరయ్య, ఉమ్మినేని నాగేంద్ర, ఎల్లంపల్లి రాజేశ్వరి, ఎం అనురాధ, పద్మావతి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

» మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సురేష్

కొణిజర్ల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల ముక్కిరిహిల్స్ గుట్ట ప్రాంతంలో 5మండలాలకు గాను మిషన్ భగీరథ పథకం ద్వారా ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. తనికెళ్ల దగ్గర ప్లాంట్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకైంది. దాంతో రెండు రోజుల నుంచి నీరు రావడంలేదని ప్రజలు తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సురేష్, శ్రీనివాసరావు ఇతర సిబ్బంది బుధ, గురువారం రెండు రోజులు మరమ్మతులు చేపట్టారు. వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



మరమ్మతులు చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

విద్యార్థులకు కంటి పరీక్షలు

తల్లాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. 24మంది విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆర్‌డీఎస్‌కే టీం వైద్యులు డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

కల్లూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ఆర్టీసీ బస్టాండులో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నందిశెట్టి నాగేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి దామాల దయాకర్ పాల్గొన్నారు.

పరంజీపై నుంచి పడి
సుతారి మేస్త్రీ మృతి



మౌలాలి(ఫైల్)

ముదిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా పరంజీపై నుంచి కింద పడి ఓ సుతారీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన మండలంలోని ముత్తారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ముదిగొండ గ్రామానికి చెందిన షేక్.మౌలాలి(45)సుతారీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ముత్తారంలో ఓ ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా పరంజీపై నుంచి కిందపడ్డాడు. అతడిని వెంటనే తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. హైబీపీ వలన మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని ధర్నా

కల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) బ్యాంకు లింకేజీ పేరుతో వీవోఏలను అసభ్య పదజాలంతో దూషిస్తున్న కల్లూరు ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం గ్రామదీపికలు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ శాఖ పరంగా ఏమైనా పనులు ఉంటే నిబంధనల ప్రకారం చేయించుకోవాలి కానీ, మహిళలని కూడా చూడకుండా అసభ్యమైన పదజాలంతో దూషిస్తున్న ఏపీఎం పని తీరును మార్చుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో గ్రామదీపికలు పనిచేస్తున్నప్పటికీ లక్ష్యాలు పూర్తి కాలేదంటూ వారిని ఏపీఎం ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. అనంతరం ఏపీఎంపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, నాయకులు దామాల దయాకర్, గ్రామదీపికల సంఘం జిల్లా కన్వీనర్ వే ము నాగమణి, అరుణ, షహీదాబేగం, జ్యోతి. రజిత, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తల్లాడ, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబాలకు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు నారపోగు వెంకట్ గురువారం ఆర్థికసాయం అందించారు. గొల్లగూడెం గ్రామం లో అనారోగ్యంతో బాధపడుతున్న పాస్టర్ దేవసహాయంకు రూ.10వేలు, తడికమళ్ల ప్రవీణ్‌కు రూ.10వేలు, తోటపల్లి సాయమ్మకు రూ.10వేలు, ఇస్నేపల్లి వరమ్మకు రూ.ఐదువేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఇసన్నపల్లి వెంకటేశ్వర్లు, సాదం మల్లయ్య, పగిడిపల్లి గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతకానిలో...

చింతకాని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు నెర్సుల యల్లయ్య కుటుంబానికి లచ్చగూడెం బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ. 12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గురిజాల హనుమంతరావు, పోట్ల సీతయ్య, పోట్ల అచ్యుతరావు, పువ్వాళ్ల వెంకటయ్య, చింతల శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో
ఇద్దరికి గాయాలు

బోనకల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బోనకల్ సాయిబాబా దేవాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం, మహబూబాబాద్, రఘునాథపాలేనికి చెందిన ఐదుగురు వ్యక్తులు శివరాత్రి పండుగ సందర్భంగా ఏపీ రాష్ట్రంలోని కోటప్పకొండ జాతరకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బోనకల్ సాయిబాబా ఆలయం వద్ద అర్ధరాత్రి కావడంతో కారును పక్కకు ఆపి పడుకున్నారు. గురువారం తెల్లవారుజామున సమయంలో ఖమ్మం నుంచి బోనకల్ వైపునకు వస్తున్న క్రమంలో మలుపు వద్ద అదుపు తప్పి ఆగి ఉన్న కారును ఢీ కొట్టగా కొంత దూరం వరకు ఈడ్చుకొని వెళ్లింది. పక్కకు ఆపిన కారులో ఉన్న వారు డోర్లు తీసుకొని బయటపడటంతో మహబూబాబాద్‌కు చెందిన కొవ్వలూరు వినయ్‌కు తీవ్ర గాయాలు కాగా, రఘునాథపాలెం గ్రామానికి చెందిన అల్లిక రామలింగేశ్వరావుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తాను పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధు



గుత్తాతో మాట్లాడుతున్న తాతా మధు, సండ్ర

ఏన్కూరు, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి)జన్నారం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీనాయకుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు తండ్రి అనంతరామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గురువారం గుత్తాను పరామర్శించారు. అనంతరామయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బానోతుమదన్‌లాల్, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా బీఆర్ఎస్ అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, యల్లంకి సత్యనారాయణ, బెల్లం వేణుగోపాల్, పొన్నం హరికృష్ణ, ముత్యాల వెంకట అప్పారావు, చుంచు విజయ్‌కుమార్, యండ్రాతి మోహన్‌రావు, సేవ్యానాయక్ తదితరులుపాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఏడీఈ తిలక్

చింతకాని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గూని ప్రసాద్ గతేడాది విద్యుదాఘాతంతో పొలంలో మృతిచెందాడు. గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నష్టపరిహారంగా రూ.5 లక్షల చెక్కును మృతుని భార్య మంగమ్మకు పెద్దగోపతి సర్కిల్ ఏడీఈ తిలక్ అందజేశారు. కార్యక్రమంలో ఏఈ చావా శ్రీధర్, సబ్ ఇంజనీర్ సందీప్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్



కల్లూరులో బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తున్న పోలింగ్ అధికారులు

వైరా, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్‌ను తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. 92.04శాతం పోలింగ్ నమోదైంది. 113ఓట్లకుగానూ 104మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ముదిగొండలో 94.28శాతం

ముదిగొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండల వ్యాప్తంగా 35మంది ఓటర్లు ఉండగా 33మంది(94.28శాతం) ఓటుహక్కును వినియోగించారు. ఎన్నికల పోలింగ్ సరళిని ఖమ్మంజిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, సయ్యద్ రఫీ, యాకూబ్‌పాషా, ఇజాజ్ పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గంలో 95.36శాతం

మధిరటౌన్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో 367 ఓట్లకు గాను 350 ఓట్లు పోలింగ్ అయ్యాయి. మధిర మండలంలో 203 ఓట్లకు గాను 196, బోనకల్ లో 34 కు ఓట్లకు గాను 34, ముదిగొండ లో 35 ఓట్లకు గాను 33 ఓట్లు, ఎర్రుపాలెం లో 59 ఓట్లకు గాను 55 ఓట్లు, చింతకాని మండలంలో 36 ఓట్లకు గాను 32 ఓట్లు పోలయ్యాయి.



తల్లాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్

కొణిజర్లలో 91శాతం

కొణిజర్ల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 66 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా 60 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరి లో మహిళ ఉపాధ్యాయులు 17 మంది, పురుషులు 43 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 90.90(91)శాతం నమోదు అయిం ది. తహసీల్దార్ రాము పోలింగ్‌ను పర్యవేక్షించారు.

తల్లాడలో 100 శాతం

తల్లాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం నిర్వహించిన పోలింగ్ తల్లాడలో నూరుశాతం నమోదైంది. గురువారం స్థానిక జడ్పీఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో మొత్తం 37మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 37మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సురేష్ సందర్శించారు. యూటీఎఫ్, పీఆర్టీయూ, బీజేపీ బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా వారి అభిమానులు తల్లాడలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు.

చింతకానిలో ...

చింతకాని, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో 36 మంది ఓటర్లుకు గాను 32 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తహసీల్దార్ కూరపాటి అనంతరాజు తెలిపారు.

కల్లూరులో 94.68 శాతం

కల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది.. మండల పరిధిలో మొత్తం 94 మంది ఓటర్లకు గాను 89మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 94.68 శాతం పోలిగ్ జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 104 పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రాజేంద్రగౌడ్ సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.





ముదిగొండలో పోలింగ్ బాక్సులకు సీల్ వేస్తున్న అధికారులు
(ఓటుహక్కు వినియోగించుకున్న దివ్యాంగుడు మల్లేశ్వరరావు)



సత్తుపల్లిలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటరు

సత్తుపల్లి నియోజకవర్గంలో 94.96శాతం

సత్తుపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సత్తుపల్లి నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. సత్తుపల్లి నియోజకవర్గంలో 94.96శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 536 మంది ఓటర్లు ఉండగా 346 మంది పురుషులు, 190 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరిలో 331 మంది పురుషులు, 178 మంది మహిళలు మొత్తం 509 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఏన్కూర్‌లో...

ఏన్కూరు, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 75 ఓట్లు ఉండగా 65 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికలను తహసీల్దార్ శేషగిరిరావు పర్యవేక్షించారు

బోనకల్‌లో 100శాతం

బోనకల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బోనకల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వందశాతం నమోదైంది. మొత్తం 34 మంది ఓట్లు ఉండగా 34 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



వైరాలో బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న పోలింగ్ సిబ్బంది